ప్రజాశక్తి

సోమవారం 21 ఆగష్టు 2023   8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

తల్లీబిడ్డల ఆచూకీ కోసం అధికారుల గాలింపు చర్యలు

కన్నీటి కడలి

- సముద్రంలో బోల్తా పడ్డ ఫైబర్ బోటు
- తల్లి, ఇద్దరు బిడ్డలు గల్లంతు
- ఈదుకుంటూ.. ఒడ్డుకు చేరిన తండ్రి

ప్రజాశక్తి-నిజాంపట్నం

సముద్రంలో ఫైబర్ బోటు బోల్తా పడి తల్లి, ఇద్దరు బిడ్డలు గల్లంతయ్యారు. తండ్రి ఈత కొట్టుకుంటూ.. ఒడ్డుకు చేరి.. ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఆదివారం నిజాంపట్నం హార్బర్ సమీపంలో జరిగింది.

నిజాంపట్నం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా, నాగాయలంక మండలం, ఏల్చేటి దిబ్బ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సోంబాబు, అతని భార్య సాయివర్ధిక (25) వారికి ఉన్న చిన్న బోటుపై ఇద్దరూ వేటకు వెళ్లి వచ్చిన మత్స్య సంపద అమ్ముకొని జీవనం సాగిస్తూ ఉంటారు. వీరికి ఇద్దరు కుమారులు తనీష్‌కుమార్ (7), తరుణేశ్వర్(11 నెలలు). భార్యాభర్తలిద్దరూ ఇంటి వద్ద పిల్లల సంరక్షణ చూసుకునే వారు లేక వారిని కూడా తమతో పాటు వేటకు తీసుకుని వెళ్లారు. ఎప్పటిలాగే శనివారం రాత్రంతా వేట చేసుకొని వచ్చిన

గల్లంతైన సాయివర్ధిక, తనీష్‌కుమార్, తరుణేశ్వర్

మత్స్య సంపదను అమ్ముకునే నిమిత్తం నిజాంపట్నం హార్బర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సముద్రం నుండి హార్బర్‌కు వచ్చే మొగ దగ్గర ఒక్కసారిగా పెద్ద అలలు రావటంతో బోటు అదుపుతప్పి అక్కడ ఉన్న రాళ్లకు ఢీకొని తిరగబడింది. దీంతో బోటులో ఉన్న నలుగురూ ▶ 2లో

ఓటర్ల వెరిఫికేషన్

ఏకపక్షంగా సాగుతోందా.?

- గ్రామాల్లో అలజడి
- పెంచుతున్న బిఎల్ఒల తీరు
- పాలకపక్ష ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల ఒత్తిడి వల్లేనని విమర్శలు
- ఇలాంటి అక్రమాలతోనే గతంలో ఆర్డీవో సహా పలువురిపై వేటు
- పీసీపల్లిలో పరిశీలన కోసం కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే ఉగ్ర లేఖ
- కేంద్ర ఎన్నికల సంఘానికే లేఖ రాసిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

– పీసీపల్లి మండలం, గుడేవారిపాలెం లోని పోలింగ్ బూత్ 190లో ఎక్కువ శాతం తెలుగుదేశం సానుభూతిపరులు కావడంతో ఓటర్ల వెరిఫికేషన్ సక్రమంగా సాగడం లేదని.. వ్యాపారాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నందున 350 మంది ఓటర్లను ఆబ్‌సెంట్ అని రాస్తున్నారని.. అదే 191లో వైసిపి సానుభూతి పరులు ఎక్కువగా ఉన్నందున ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదించారని కనిగిరి మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి ఆదివారం నాడు కలెక్టర్‌కు లేఖ రాశారు. ఓటర్ల జాబితాల వెరిఫికేషన్ ఏకపక్షంగా సాగుతోందని, దీనిపై చర్యలు తీసుకొని జాబితాలు సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు.

– ఇటీవలే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కేంద్ర ఎన్నికల సంఘానికి రెండు పర్యాయాలు లేఖ రాశారు. నియోజక వర్గంలో భారీగా ఓట్లు తొలగించేందుకు వైసిపి నేతలు క్షేత్రస్థాయి అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని, రోజువారీగా సమీక్ష చేస్తున్నారని లేఖలో ఫిర్యాదు చేశారు. ఫామ్-7పై నిత్యం సచివాలయ స్థాయిలోని సిబ్బందితోనూ సమీక్ష చేస్తున్నారని కొన్ని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. పర్చూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఓట్లకు పైగానే తొలగించాలనే కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వాస్తవంగా కూడా ఇటీవల పర్చూరు నియోజక వర్గంలో ఓట్ల జాబితాలపై పాలకపక్ష నేతలు దృష్టి సారించారు. అధికారులకు ఆదేశాలిచ్చారు. బిఎల్ఒలను అన్ని రకాలుగా ఒత్తిళ్లు చేసి ఓట్లు తొలగించేయత్నాలు చేస్తున్నారు. వీటిపై పర్చూరు ఎమ్మెల్యే ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

– వాస్తవానికి ఇలాంటి అక్రమాలు చేసినందుకే గతంలో ఒంగోలు ఆర్డీవోతో పాటు పలువురు అధికారులపైనా వేటు పడింది. ఆర్డీవోగా పనిచేసిన ఇస్మాయిల్‌పై అప్పట్లో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.

దీంతో అప్పటి కలెక్టర్ కృష్ణబాబు ఓటర్ల జాబితాలను సక్రమంగా చేసేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో ఓట్లను ఊహించిన దానికంటే ఎక్కువగానే తీసేశారనే చర్చ కూడా వచ్చింది. ఓటర్ల జాబితాలు సక్రమంగా తయారుచేయనందున ▶ 2లో

మంత్రి నాగార్జున స్వగ్రామంలో

చిన్నారిపై లైంగికదాడి

▲ 3లో

షాపును తగలబెట్టబోయి..

తాను కూడా దగ్ధం

▲ 3లో

ఊరి బయట వైఎస్ఆర్ క్లినిక్‌లు

మహిళా సిబ్బందికి ఇబ్బందులు

▲ 8లో

విద్యారంగంలో వినాశకర మార్పులు

- సీపీఎస్ రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారు..
- ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-దొనకొండ

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు పాఠశాల విద్యారంగంలో చేస్తున్న వినాశకర మార్పులన్నీ విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లకుండా ముంచుతాయని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో దొనకొండ జడ్పీ పాఠశాలలో యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన విద్యా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యారంగంలో పెద్ద వినాశక కార్యక్రమాన్ని సిఎం జగన్ ముందుకు తీసు కెళ్తున్నాడని, దేని మీద నిలబడతాడో? ఏవిధానం ముందుకు వస్తుందో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. గోడలకు రంగులు వేశామని చెప్పి ఏదో అవసరాలు తీర్చామని గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ఎవరితో చెప్పకుండా విద్యారంగాన్ని ముంచేయటం సరైన పద్ధతి కాదని, ఈ విధానం మార్చుకోవాలన్నారు. జగన్ పాదయాత్ర సమయంలో చెప్పినట్లు డీఏలు, అరియర్స్‌లు సకాలంలో చెల్లింపులు, మంచి పీఆర్సీ, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ.. ఏమయ్యాయని ప్రశ్నిస్తూ.. దాన్ని మాట తప్పటం అంటారో.? లేక మడం తిప్పటం అంటారో? జగన్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా మాయ మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. మధ్యమధ్యలో గద్దర్ రచించిన పాటలు పాడి ఉపాధ్యాయులను ఉత్సాహపరిచారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరును, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ముందుగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, ఎంఈవో సాంబశివరావు, ఎంఈవో-2 అమీర్, సర్పంచ్ గ్రేస్‌రత్న కుమారి, యుటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరారెడ్డి, ఎస్ రవి, మండల యుటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

వాగుకూ పట్టా.!

- రస్తాకు కూడా మంజూరు..
- మార్కాపురంలో రెవెన్యూ శాఖ లీలలు.!

ప్రజాశక్తి-మార్కాపురం

రెవెన్యూ శాఖలో అడ్డదారి ఎంచుకున్న కొందరు అధికారులు తలచుకుంటే ఏమైనా చేయగలరనేందుకు ఇదో చక్కటి ఉదాహరణ...! పంట పొలాల్లోని వర్షపు నీరు ప్రవహించే వాగుకూ... రస్తాకు సైతం పట్టా ఇచ్చారు. పాస్ పుస్తకాలు మంజూరు చేసి ఓ వ్యక్తికి హక్కులు కల్పించి ఔరా అనిపించారు ఇక్కడి రెవెన్యూ అధికారులు.!

మార్కాపురం ప్రాంతం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. ఎందుకూ పనికిరాని భూముల విలువ కూడా పెరుగుతోంది. ఈ క్రమంలో వాగులు, వంకలు, రస్తాలు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. స్వార్థపరుల ఆశలకు కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తుండటంతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే వనరులు సైతం కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

మార్కాపురం మండలంలోని ఇడుపూరు ఇలాఖాలో తాజాగా మరో అక్రమం వెలుగుచూసింది. దివారం ఆ ప్రాంతంలో భూముల కొలతలకు కోసం వెళ్లిన సర్వేయర్‌కు ఈ అక్రమం వెలుగు చూడటంతో అవాక్కయ్యారు. సాగుకు పనికి రాని వాగుకు, రస్తాకు పట్టా ఇవ్వడమేమిటని విస్తుపోయారు.



వాగు, రస్తా మ్యాపు

ఇడుపూరు ఇలాఖాలోని సర్వే నెంబర్ 503లో 2.84 ఎకరాల విస్తీర్ణంలో వాగు ఉంది. కేవలం 20 అడుగుల వెడల్పుతో కిలోమీటరున్నర దూరం పొడవున ఈ వాగు ఏర్పడింది. దీన్ని నల్లవాగు అంటారు. నల్లవాగుకు ఇరువైపులా రెండువేల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ఆ భూములకు వాగు ఒడ్డు రస్తాగా ఉంది. వర్షాల సమయంలో వచ్చిన వర్షపు నీరు కాస్తా ఇదే వాగు ద్వారా సమీపంలోని గుండ్లకమ్మ నదిలోకి చేరుతుంది. అక్కడి అవసరాల కోసం ఏర్పాటైన వాగుతో పాటు రస్తాను బట్టగిరి వెంకటలక్ష్మి పేరుతో పట్టా ▶ 2లో

ఓటర్ల వెరిఫికేషన్ ఏకపక్షంగా సాగుతోందా.?

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో ఎన్నికల సంఘం ఇలాంటి చర్యలు తీసుకుంది.ఇపుడు ఆ తరహాలో ఎన్నికల సంఘం ఉందా?లేదా?అనేదీ చర్చగా మారింది. ఎన్నికల సంఘం పూర్తిగా ప్రభుత్వం ఏదిచెబితే దాన్ని అనుసరించే స్థితిలోకి పోయాకే ఇలాంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

పలు నియోజకవర్గాల్లో ఇప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది తీసుకునే నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఇంకా చెప్పాలంటే మండలాల్లో బిఎల్‌ఓలు పూర్తిగా పాలకపక్షం ఏది చెబితే అదే చేస్తున్నారు. ఎవరి ఓట్లు తీసేయాలి? ఎవరివి ఉంచాలో జాబితాల్లో టిక్కులు పెడుతున్నారు. పట్టణాల్లో కంటే గ్రామాల్లోనే ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. ఎందుకంటే పట్టణాల్లో ఏ పార్టీ సానుభూతిపరులనేదీ తెలియదు. గ్రామాల్లో స్పష్టంగా ఉంటుంది. ఇప్పుడు గ్రామాల్లోనే ఎక్కువగా ఈ తరహా అక్రమాలు సాగుతున్నాయి. అయితే జాబితాల నుంచి ఏదో రకంగా తెలుగుదేశం సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు కుస్తీలు పడుతున్నారు. ఏదో కారణంతో జాబితాల్లో బ్లాక్ చేస్తున్నారు. ఆబ్‌సెంట్ రాయడం, అడ్రసులు సరిగా లేవనడం, ఏదో గుర్తింపు కార్డులేదని చూపడం ఇలా పలు కారణాలతో జాబితాల్లో నుంచి తీసేసేందుకు ఆలోచనలు చేస్తున్నారు. వీటిని గుర్తించిన చోట్ల వెంటనే తిరుగుబాటు వస్తోంది. బిఎల్‌ఓలను నిలదీస్తున్నారు. ఇటీవలే ఆధార్‌ను కూడా ఓటర్లకు అనుసంధానం చేశారు. వాటి ఆధారంగా కూడా ఓటర్ల జాబితాలను వెరిఫికేషన్ చేయడానికి వీలుంది. దీన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం లేదు. స్థానికంగా లేరనే సాకుతో పశ్చిమప్రాంతాల్లో ఎక్కువగా తీసేసేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. ఇవే గ్రామాల్లో గొడవలకు దారితీస్తాయి. వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. వెరిఫికేషన్ ఏకపక్షంగా లేకుండా చూడాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలి. అందుకు ఎన్నికల సంఘం అధికారులు కూడా అధికారులకు తగు సూచనలు ఇవ్వాలి. ప్రజాప్రతినిధులు, పార్టీలు, ఓటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించాల్సిన అవసరం ఉంది.

కన్నీటి కడలి

(మొదటిపేజీ తరువాయి)

సముద్రంలో పడిపోయారు. సోంబాబు ఈత కొట్టుకుంటూ ప్రాణాలు దక్కించుకొని ఒడ్డుకు చేరుకున్నాడు. సాయి వర్ధిక, తనీష్ కుమార్, తరుణేశ్వర్ గల్లంతయ్యారు. రాత్రి వరకూ వారి ఆచూకీ తెలియలేదు. గల్లంతైన వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వెంకట్రావు చేసిన కృషి మరువలేనిది

ఒంగోలు సబర్బన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శింగరాజు వెంకట్రావు చేసిన కృషి మరువలేనిదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైసిపి నగర మాజీ అధ్యక్షులు, దివంగత శింగరాజు వెంకట్రావు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక భాగ్యనగర్‌లోని బదిరుల పాఠశాలలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. పండ్లు పంచిపెట్టారు. ముందుగా వెంకట్రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపిని అభివృద్ధి చేయడంలోనూ, పార్టీని అధికారంలోకి తీసుకు రావడం కోసం వెంకట్రావు ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో శింగరాజు వెంకట్రావు సతీమణి, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్ రెడ్డి, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్ బాబు, యనమల నాగరాజు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కొమరోలు: కొమరోలు మండలం గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన యాదవ్ సోదరులకు ఆగస్టు 15న ప్రకాశం జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు మరియు కలెక్టర్ గారి చేతులు మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డు అందిచారు. వారిని ఆదివారం ఉదయం వేణుగోపాల స్వామి దేవస్థానం నందు చైర్మన్ ఓ.వెంకటయ్య నియోజకవర్గ యాదవ సోదరులను ఘనంగా సన్మానించడం జరిగినది ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీనివాసులు పిచ్చయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొనకనమిట్ల :మండలంలోని పెదారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభ ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బరిగే నరసింహారావు, కే నరసింహారావు, లక్ష్మీనారాయణ, మాల్యాద్రిరెడ్డి ఉపాధ్యాయులు నరసింహారావు, లక్ష్మీనారాయణ, పిఎంసి చైర్మన్ వెదురు కష్ణారెడ్డి, ఎదురు మాల్యాద్రి రెడ్డి, నల్లపు తిరుపతిరెడ్డి, వి రాంబాబు, సిహెచ్ అర్జున్, ఎం శ్రీనివాసరెడ్డి, డి రమణమ్మ, సాయి లక్ష్మి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాగుకూ పట్టా.!

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేశారు. ఈ భూమి సాగుకు కూడా అనుకూలమైంది కాదు. 20 అడుగుల వెడల్పుతో కిలోమీటరున్నర దూరం వరకు కాలువ మాదిరిగా ఈ వాగు కనిపిస్తుంది. నేటికీ పెద్ద ఎత్తున చిల్లకంప చెట్లతో నిండుకుంది. పట్టా పొందిన వారు ఏనాడూ సాగు చేసిన దాఖలాలు కూడా లేవు. భవిష్యత్‌లో పట్టా పొందిన వ్యక్తి ఆ భూమి తనదంటూ అడ్డం తిరిగిందంటే... వేలాది ఎకరాల భూ యజమానులు తమ పొలాల్లోకి వెళ్లేందుకు రహదారి సౌకర్యాన్ని కోల్పోవాల్సి వస్తుంది. వర్షాల సమయంలో వర్షపు నీరు అటుగా వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తే పొలాల్లో నీరు నిల్వగా ఉండాల్సిందే. వాగుకు, రస్తాకు అక్రమంగా పట్టా పొందిన విషయం తెలుసుకున్న అక్కడి భూ యజమానులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తప్పు ఎవరు చేశారో తెలియదు కానీ... ప్రస్తుత రెవెన్యూ అధికారులు 503 సర్వే నెంబరులోని వాగుకు, రస్తాకు పట్టా ఎలా ఇచ్చారో విచారణ చేపట్టాలని కోరుతున్నారు. వందలాది మంది రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తక్షణమే అక్రమంగా పొందిన పట్టా రద్దు చేయాలని, వాగు, రస్తాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోల్డ్ హౌస్ ప్రారంభం

దరిశి : స్థానిక పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో దేవతి వారి నూతన జ్యువెలరీ అమృతసాయి గోల్డ్‌హౌస్ & పాన్‌బ్రోకర్ షోరూమ్‌ను రాష్ట్ర మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు సతీమణి, ఎపి ఆర్యవైశ్య మహిళ విభాగ గౌరవ అధ్యక్షురాలు శిద్ధా లక్ష్మీపద్మావతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ యజమాని దేవతి రామారావు సతీమణి ఈశ్వరిసాయి శిద్ధా లక్ష్మీపద్మావతిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఎఎంసి చైర్మన్ సూరే చిన్న సుబ్బారావు, దేవతి మహానంది, దేవతి ప్రసాద్, దేవతి భాస్కర్, బి సుబ్బారావు, కొండలు, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

గోల్డ్‌షాపును ప్రారంభిస్తున్న శిద్ధా లక్ష్మీపద్మావతి

గడప గడపకూలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కెపి.నాగార్జునరెడ్డి పొదిలి మండలం కొండాయపాలెం గ్రామ సచివాలయం పరిధి మూగచింతల గ్రామ పంచాయతీలోని ఎస్సీ పాలెం, హరిజన కాలనీలలో గడప గడపను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి లబ్ధిదారులకు వివరించి వారికి సంక్షేమ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచి దేవరపు చిన్నమ్మి, సొసైటీ ప్రెసిడెంట్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, గ్రామ ముఖ్య నాయకులు కోటి, దేవరపు వెంకటేశ్వర్లు, శేషి రెడ్డి, ఆంజనేయరెడ్డి, మండల ముఖ్య నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

బిజెపిని తరిమికొడదాం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

రాబోయే ఎన్నికల్లో బిజెపిని దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని యువజన కాంగ్రెసు జాతీయ కార్యదర్శి బిఆర్ గౌస్ అన్నారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా స్థానిక మంగమూరు రోడ్డులోని ఆయన విగ్రహానికి యువజన కాంగ్రెసు నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. దేశ అభివృద్ధిని పక్కన పెట్టి ప్రజల మధ్య కులాలు, మతాల చిచ్చు పెడుతూ పబ్బంగడుపుకుంటుందన్నారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం రికార్డుస్థాయిలో పెరిగి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెసు జిల్లా నాయకులు షేక్ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

దావా సమను
అండర్ ఆర్డర్ 5 రూల్స్ 1,5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No 271/2022

షేక్ రియాజ్ ..... వాది

Vs

షేక్ బీబి .... ప్రతివాది

To

షేక్ బీబి భర్త మహమ్మద్, ముస్లిం 50 సంవత్సరాలు, గృహిణి, 8వ లైన్, ఇరువురు రోడ్డు, పామూరు (గ్రామం, మండలం) ప్రకాశం (జిల్లా) గారికి

పై నెంబర్ దావా పరిహారములు పొందగోరి వాది మీ పైన దావా దాఖలు చేసియున్నారు. గనుక మీఆక్షేపణలు ఉన్నచో తేదీ:05.09.2023 పగలు 10:30 గంటIIలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని పరోక్షంగా గాని వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించ బడునని తెలుసుకొనేది.

(బై ఆర్డర్ ఆఫ్ ద కోర్ట్)

వాయిదా తేదీ:05.09.2023

బత్తుల మురళీకృష్ణ
B.A,L.L.B
వాది తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా
సెల్: 9505550557

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓఎస్ నెం.677/2021

నెమిలిదిన్నె చిన్న అంకిరెడ్డి మరియు మరొకరు ...వాదులు

ఎదిరి

సబ్బసాని యోగమ్మ మరియు ఐదుగురు ...ప్రతివాదులు

టు,

1.సబ్బసాని లోకేష్‌రెడ్డి ...డి3
తండ్రి ఈశ్వరరెడ్డి
2.సబ్బసాని కీర్తిరెడ్డి ...డి4
భర్త లోకేష్‌రెడ్డి

డి3 మరియు **డి4** ఇరువురి నివాసం కరెంట్ ఆఫీసు ఎదురుగా, కందులాపురం గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు, ప్రతివాదులపై పర్మినెంట్ ఇన్‌జెక్షన్ పరిహారము పొందగోరి దావాను దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో 3వ మరియు 4వ ప్రతివాదులకు ఏమైన ఆక్షేపనలు ఉండిన యెడల 30.08.2023వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు దావాను విచారించి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)

ఇట్లు

గిద్దలూరు **శ్రీ శివపురం వెంకటనాగేంద్రబాబు**
తేది:18-08-2023 **శ్రీ ఉదయగిరి మల్లికార్జునరావు**
వాదుల పరం అడ్వకేట్లు, గిద్దలూరు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA NO 24/2022 EA NO 25/22
EPNO 152/2013 OSNo 66/96

1. ముండ్లమూరి రామయ్య(డైడ్)
2. ముండ్లమూరి శేషమ్మ వగైరాలు

...పిటిషనర్లు /డిహెచ్‌ఆర్లు

వర్సెస్

1. కుంచాల వెంకటేశ్వర్లు (డైడ్)
2. కుంచాల మల్లికార్జునరావు వగైరాలు

... రెస్పాండెంట్లు

To

ఆర్ 2) కుంచాలమల్లికార్జునరావు
తండ్రి లేటు వెంకటేశ్వర్లు
అర్ 3) కుంచాల ఏడుకొండలు
తండ్రీ వెంకటేశ్వర్లు కోటయ్య
అర్ 4) కుంచాలకోటయ్య తండ్రి లేటు వెంకటేశ్వర్లు
పై వారి అందరూ రెస్పాండెంట్ల అడ్రస్సు
మైనంపాడు గ్రామం, సంతనూతలపాడు మండలం ప్రకాశం జిల్లా.

పై నెంబర్ గల EA లలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ జారీ కాబడి యుండ లేదు కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం తేదీ 25.08.2023న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకునేది లేనియెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయడమైనది

ఇట్లు
చుండూరు వెంకట్రావు
అడ్వకేట్
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు, ప్రకాశం జిల్లా,
Cell 9440 510 269

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.1113/2021 ఇన్ ఓఎస్ నెం.677/2021

నెమిలిదినెశీ చినశీఅంకిరెడ్డి మరియు మరొకరు ...పిటిషనర్లు/వాదులు

ఎదిరి

సబ్బసాని యోగమ్మ మరియు ఐదుగురు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు,

1.సబ్బసాని లోకేష్‌రెడ్డి ...ఆర్3
తండ్రి ఈశ్వరరెడ్డి
2.సబ్బసాని కీర్తిరెడ్డి ...ఆర్4
భర్త లోకేష్‌రెడ్డి

ఆర్3 మరియు **ఆర్4** ఇరువురి నివాసం కరెంట్ ఆఫీసు ఎదురుగా కందులాపురం గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో పిటీషనర్లు / వాదులు, రెస్పాండెంట్లు / ప్రతివాదులపై ఇంటరీమ్ ఇన్‌జెక్షన్ పరిహారము పొందగోరి పిటీషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో 3వ మరియు 4వ రెస్పాండెంట్స్ / 3వ మరియు 4వ ప్రతివాదులకు ఏమైనా ఆక్షేపనలు ఉండిన యెడల 30.08.2023వ తేది ఉదయం 10:30గంటలకు పై కోర్టులో వారి ఎదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు పిటీషన్‌ను విచారించి తీర్మానించబడును మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)

ఇట్లు

గిద్దలూరు **శ్రీ శివపురం వెంకటనాగేంద్రబాబు**
తేది:18-08-2023 **శ్రీ ఉదయగిరి మల్లికార్జునరావు**
పిటీషనర్లు/వాదుల పరం అడ్వకేట్లు.
గిద్దలూరు.

నోటీసు
అండర్ ఆర్డర్ 38 రూల్ 5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No 754/2022,O.s No 271/2022

షేక్ రియాజ్ ... పిటిషనర్/ వాది

Vs

షేక్ బీబి ...రెస్పాడెంట్ / ప్రతివాది.

To

షేక్ బీబి భర్త మహమ్మద్, ముస్లిం 50 సంIIలు, గృహిణి, 8వ లైన్, ఇరువురు రోడ్డు, పామూరు (గ్రామం, మండలం) ప్రకాశం (జిల్లా)

పై నెంబర్ దావా పరిహారములు పొందగోరి వాది మీ పైన దావా దాఖలు బాకీ కి పూచి కత్తుగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా మీ తాలూకు స్థిరాస్తిని హోలు జప్తు చేయగోరి పిటిషనర్ పిటీషన్ దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో తేదీ: 05.09.2023 పగలు 10:30 గంటIIలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని, హాజరై తెలుపు కొనేది. లేనిచో ఎక్స్ పార్టీగా తీర్మానించ బడునని తెలుసుకొనేది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, కనిగిరి సబ్.డి, పామూరు మండలం, పామూరు పంచాయతీ ఏరియాలో చేరిన, పామూరు గ్రామంలో కోరు మెట్ట సర్వే నెం 499/8 .య 15.94 సెంట్లు గల పూరా నెంబర్ భూమిలో వ్యస్టిన య 3.22 సెంట్లు గల భూమిలో లేఅవుట్ ప్లాన్ దాఖలా నెం.54 రూ ప్లాటుకు హద్దులు.

తూర్పు: 45 రు ప్లాటు
దక్షిణం: నెం 55 రు ప్లాటు
పడమర: రోడ్డు
ఉత్తరం: నెం 53 రు ప్లాటు

ఈ హద్దులు లోని తూర్పు- పడమర అ:50బి0 లు లేక 15.23 మీటర్లు ఉత్తర- దక్షిణం 20బి0 లు లేక 6.09 మీటర్లు కొలత గల 111.11 చ.గ. లేక 92.99 చ.మీ ఖాళీ స్థలమును మామూలు దారులు వగైరా సర్వఈజ్ మెంట్ హక్కు లున్నాయి. ఈ ఆస్తి ఏ వార్డులో చేరలేదు.

వాయిదా తేదీ: 05.09.2023

(బై ఆర్డర్ ఆఫ్ ద కోర్ట్)

వాయిదా తేదీ: 05.09.2023

బత్తుల మురళీకృష్ణ
B.A,L.L.B
వాది తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా
సెల్: 9505550557

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న సిఐ

ఎమ్మెల్యేను కలిసిన ట్రాఫిక్ సిఐ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి ఎస్సైగా పనిచేసి పదోన్నతి పై ఒంగోలు ట్రాఫిక్ సిఐగా బదిలీ అయిన కే మల్లికార్జున మార్కాపురం శాసనసభ్యులు కేపీ నాగార్జునరెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి కతజ్ఞతలు తెలియజేశారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

30మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో ఆదివారం స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కృష్ణమోహన్ శిబిరంలో పాల్గొని 32 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మధుమోహం, రక్తపోటు వ్యాధులున్నవారు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు మింగాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు స్వచ్ఛంధ సేవ చేస్తున్న మన ఊరి ఆరోగ్యవికాసం కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచయ్య, వీరమోసు మస్తానరావు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు, దేవి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే స్వామి, సత్య

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని చిన్నకండ్లగుంట గ్రామానికి చెందిన మల్లాల బాలకోటయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు వివాహ కార్యక్రమంలో కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని వరుడుని ఆశీర్వదించారు. అలాగే కొండపి గ్రామానికి చెందిన ముసునూరి వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ కార్యక్రమంలో, అనకర్లపూడి గ్రామానికి చెందిన పూండ్ల శివయ్య కుమారుడు వివాహ కార్యక్రమంలో పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి, వసంతరావు, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, దామ మురళి, మండల యూత్ అధ్యక్షులు కాలేసా, గ్రామ నాయకులు నన్నూరి సుబ్బారామయ్య, రమేష్, ఐటిడిపి మండల అధ్యక్షులు బూదవాటి కిరణ్, మండలంలోని టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ హహోత్సవంలో ఎమ్మెల్యే స్వామి, సత్య

మంత్రి నాగార్జున స్వగ్రామంలో..

చిన్నారిపై లైంగిక దాడి

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

మంత్రి మేరుగు నాగార్జున సొంత గ్రామమైన భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరులో ఆరేళ్ల బాలికపై 20 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గ్రామంలోని దళితవాడలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న బీసీ (గౌడ) సామాజికవర్గానికి చెందిన బాలికను అదే దళితవాడకు చెందిన యువకుడు నమ్మబలికి పాఠశాల నుండి ఎత్తుకొని తన ఇంటికి తీసుకెళ్లాడు. టీచర్ హాజరువేసుకొని లెక్క చూసుకోగా బాలిక కనిపించలేదు. తోటి చిన్నారులను టీచర్ అడుగగా ఒక వ్యక్తి ఎత్తుకుని తీసుకువెళ్లినట్లు చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు యువకుడి ఇంటికి వెళ్లడంతో టీచర్‌ను చూసి ఆ యువకుడు పరారయ్యాడు. గ్రామస్తులు గమనించి యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. తెనాలి వైద్యశాలకు తరలించి.. వైద్య పరీక్షలు చేయించారు. బాలిక అత్యాచారానికి గురైనట్లు రిపోర్టులో తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నాగార్జున తెనాలి వైద్యశాలకు వెళ్లి బాలిక పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. ఇలాంటి ఘటన తన గ్రామంలో జరగటం దురదృష్టకరమని అన్నారు.

షాపును తగలబెట్టబోయి..

తాను కూడా మంటల్లో దగ్ధం

- చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దరిశి

టెంట్‌హౌస్‌ను దహనం చేయబోయి.. ఆ మంటల్లో అతను కూడా కాలిపోయిన ఘటన దర్శిలో ఆదివారం జరిగింది. దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు అన్నదమ్ములు. పెద్ద నరసింహులుకు పిల్లలు లేరు. చిన్న నరసింహులుకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు పోతంశెట్టి వరప్రసాద్(45)ను పెద్ద నరసింహులు దత్తత తీసుకున్నారు. పెద్ద నరశింహులు 2020లో మృతి చెందాడు. పెద్ద నరసింహులు ఆస్తిలో తనకు కూడా వాటా కావాలని వరప్రసాద్ సోదరుడు అడిగాడు. దానికి వరప్రసాద్ ఒప్పుకోలేదు. పెద్ద నరసింహులు ఆస్తిలో తనకు కూడా వాటా కావాలని వరప్రసాద్ తమ్ముడు కోర్టుకెళ్లాడు. పెద్ద నరసింహులుకు చెందిన పట్టణంలోని షాపును ఆవుల శ్రీనివాసులు అనే వ్యక్తి అద్దెకు తీసుకొని టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. పెద్ద నరసింహులు చనిపోయిన నాటి నుంచి శ్రీనివాసులు అద్దె చెలించటం లేదు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులుకు, వరప్రసాద్‌కు కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం వరప్రసాద్ భార్య ఉమాదేవి, పెద్ద కుమార్తె హరిచందనతో కలిసి గుంటూరులో చదువుతున్న కుమారుడు దగ్గరకు వెళ్లదామని ఉదయం 5 గంటలకు ఆటోలో బయలు దేరారు. వరప్రసాద్ తనకు బాగలేదని తరువాత వస్తానని భార్యకు చెప్పగా వారు వెళ్లిపోయారు. వరప్రసాద్ ఒక లీటరు పెట్రోల్ తీసుకుని టెంట్ హౌస్ వద్దకు వెళ్లి షట్టరు తీసి పెట్రోల్ పోసి.. షాపు తగలబెట్టాడు. షాపులోకి వెళ్లిన తరువాత షెట్టరు రాకపోవడంతో మంటలలో కాలిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పొగలు రావడం గమనించిన స్థానికులు షట్టర్‌ను తీసేసరికే కాలిన గాయాలతో వరప్రసాద్ ఉన్నాడు. వెంటనే 108లో ఒంగోలుకు తరలించగా.. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. వరప్రసాద్ కొంతకాలంగా బంగారం షాపు నిర్వహిస్తున్నాడు. ఈయన స్వగ్రామం మండలంలోని పోతవరం గ్రామం. వరప్రసాద్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశానికి కలాం చేసిన సేవలు ఎనలేనివి : బాలినేని

అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

భారతదేశానికి ఎపిజె అబ్దుల్ కలాం చేసిన సేవలు నిరుపమానమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక 29వ డివిజన్ రాజపానగల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి, డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆదివారం బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాలినేని మాట్లాడుతూ దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి అబ్దుల్ కలాం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన జీవితం అందరికి ఆదర్శప్రాయమని చెప్పారు. నేటి యువత కలాంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కలాం విగ్రహం ఒంగోలులో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో నగర డిప్యూటి మేయర్‌లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, స్థానిక కార్పొరేటర్ ఎస్‌కె ఫాతిమాబి, తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఆర్టీసి బస్సులు తీసివేయాలి

ప్రజాశక్తి-కొండపి

ఒంగోలు ఆర్టీసి డిపో నుంచి కాలం చెల్లిన బస్సులు వెంటనే తీసివేసే విదంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కెజి మస్తాన్ డిమాండ్ చేశారు. ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా కొండపి వస్తున్న ఏపి29జడ్ 2006 బస్సు ఇంజన్ నుంచి పెద్దపెద్ద శబ్దాలు వస్తూన్నాయని అన్నారు. ఆలాంటి బస్సులు ఎక్కినప్పుడు ప్రయాణికులను భయభ్రాంతులు గురిఅవుతున్నారని, ఇలాంటి బస్సులపై వెంటనే తీసివేయాలని ప్రయాణికులు కోరుతున్నారని చెప్పారు. బస్సు ఎక్కిటప్పుడు మెట్లు చాలా ఎత్తులో ఉండడం వలన వృద్దులు, చిన్నారులు, గర్భిణిస్త్రీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.. వాటిని కూడా గుర్తించి ప్రయాణికులు సౌకర్యార్థంగా ఉండే విధంగా చూడాలని ఆయన తెలియజేవారు. మారు మూల గ్రామాలలో కూడా కాలం చెల్లిన బస్సులు తిప్పుతున్నారని అటువంటి వాటిని ఆర్టీసి యాజమాన్యం గుర్తించి కాలం చెల్లిన బస్సులను తీసువేయాలని కెజి మస్తాన్ కోరారు.

కాలం చెల్లిన బస్సు లోపలి భాగం, ఎత్తులో ఉన్న బస్సు మెట్లు

వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు నవీన్

అనుమానంతో వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - చుండూరు

భార్యపై అనుమానంతో పక్క ఇంటిలో నివాసం ఉంటున్న స్నేహితుడ్ని కత్తితో దాడి చేసిన ఘటన స్థానిక అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండసీమ నవీన్ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. అతని ఇంటికి దగ్గరలోనే ఎస్‌కె జానీ అతని భార్యతో కలిసి అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. నవీన్, జానీ ఇద్దరూ స్నేహంగా ఉంటున్నారు. దీంతో ఇద్దరూ కలిసి పనికి వెళుతూ ఉంటారు. ఈ క్రమంలో ఎస్‌కె జానికి కొండసీమ నవీన్ మీద అనుమానం కలిగింది. తన భార్యతో నవీన్‌కు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో ఎలాగైనా కొండసీమ నవీన్‌ను హత్య చేసేందుకు పతకం వేసుకున్నారు. శనివారం రాత్రి సమయంలో రైల్వే స్టేషన్ దగ్గరకు మద్యం తాగేందుకు పిలిచాడు. ఇద్దరూ మద్యం తాగిన తర్వాత ఎస్‌కె జానీ అతని స్నేహితుడు కలిసి నవీన్ మీద కత్తితో కిరాతకంగా దాడి చేశాడు. నవీన్ శరీరంపై మూడు చోట్ల దాడి చేశారు. అతను ప్రాణాపాయ స్థితిలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు 108వాహనంలో గాయాలతో ఉన్న నవీన్‌ను గుంటూరు జిజిహెచ్‌కి తరలించారు. గుంటూరు డాక్టర్లు వైద్యం చేసి ప్రాణాపాయ స్థితి నుండి కాపాడారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఎస్‌కె జానీ వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు జోక్యం చేసుకుని జానీపై చర్యలు తీసుకోవాలని బాదితుని కుటుంబ సభ్యులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

అద్దంకి : లారీ–ఆటో ఢీకొన్న ఘటన ఆదివారం పట్టణంలోని దర్శి రోడ్డులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దరిశి పట్టణానికి చెందిన రెండు కుటుంబాల వారు బల్లికురవ మండలం గొర్రెపాడు గ్రామంలోని అంకమ్మ తల్లి దేవస్థానం వద్దకు వచ్చి మ్రొక్కులు చెల్లించుకుని తిరిగి దర్శికి వెళ్తున్న సమయంలో దర్శి రోడ్డులోని మూడు అంతస్తులు భవన సమీపంలోని డివైడర్ వద్ద లారీ–ఆటో బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 11మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు. బత్తుల సులోచన, బత్తుల కృష్ణ తేజ, బత్తుల సురేష్, బత్తుల ధనలక్ష్మి లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన క్షతగాత్రుడు

రామాలయంలో చోరీ

పర్చూరు :మండలంలోని తిక్కరాజుపాలెం రామాలయంలో చోరీ జరిగింది. శనివారం వేకువ జామున గుడివెనుకనే ఉంటున్న పూజారి భార్య నిద్రలేచి కిటిలో నుండి ఆలయం వైపు చూడగా తలుపులు తీసి ఉన్నట్లు గమనించింది. భర్తను నిద్రలేపి వెంటనే చప్పగా ఇరుగు పొరుగును పిలిచారు. గుడిలోకి వెళ్లి చూశారు. తాళం పగులగొట్టి ఉండటాన్ని చూశారు. సుమారు కిలో వెండి వస్తువులు, అమ్మవారి బంగారు తాళిబొట్టు, రెండు జతల బొట్టుబిళ్లలు అపహరించినట్లు గుర్తించారు. ఎస్ఐ చెంచుప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల కృషితోనే పిఎసిఎస్ సొసైటీ అభివృద్ధి

నూతన భవన ప్రారంభ సభలో మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సురేపల్లిలో రు.25లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సొసైటీ చైర్మన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు (చిన బుజ్జి) అధ్యక్షత వహించారు. సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ గత పాలకుల పాలనలో సొసైటీ పూర్తిగా వెనుకబడిందని అన్నారు. నేడు రైతులకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలతో రు.80లక్షల

నూతన సొసైటీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

వరకు లాభాలలో నడుస్తోందని అన్నారు. దీని ద్వారా నూతన భవనం నిర్మించుకోగలగటం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సొసైటీ రూ.30కోట్లు వరకు టర్నోవర్ జరుపుకుంటుందని అన్నారు. అందుకు నేటి పాలకవర్గం కారణమని అన్నారు. రైతులు, సిబ్బంది సమిష్టి కృషితో సొసైటీ మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిడిసిసిబి చైర్పర్సన్ లాలుపురం రాము, సిఏఓ కృష్ణవేణి, డివిఓ రామారావు, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, నాయకులు మోర్ల సత్యనారాయణ, శేకరం, బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

భోజన శాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దాతలు

భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనక నాగవరపు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భోజనశాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. వేటపాలెం చుండూరులంప గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టనున్నట్లు దేవస్థానం మాజీ చైర్మన్ అచిం చెట్టి భానుమూర్తి తెలిపారు. నిర్మాణానికి రూ.14లక్షల ఖర్చవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుండూరు శ్రీనివాసరావు ధర్మపత్ని రమాదేవ, సోమిశెట్టి శ్రీనివాసరావు, బాణాల సాంబశివరావు, మాజీ ధర్మ కర్త బండ్ల బాబు, కాయలు వెంకట్రావు, భవాని శంకర్, బొమ్మిడి శ్రీనివాసరావు, బాణాల ఉమా మహేశ్వరావు, కోటేశ్వరరావు, అర్జునరావు, మస్తానరావు (చిన్ని), నాగరాజ్, పి శివరామ్, వెంకటరమణ, విజయ్, సుబ్బారావు, సాంబమూర్తి, వీరయ్య, సిద్ధాంతి గుద్దంటి సుందరరామయ్య పాల్గొన్నారు.

దోమల నివారణపై విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

దోమలను నివారించాలని ర్యాలీ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ధర్మవరం జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మోదపల్లి పిహెచ్‌సి డాక్టర్ ఎన్ జయచంద్రరావు విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులు నివారణపై వివరించారు. దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందని మొదటిసారి బ్రిటిష్ దేశస్థుడైన డాక్టర్ సర్రో నాల్రాస్ 1897 ఆగస్టు 20న కనుగొన్నారని అన్నారు. ఆడ దోమని అశ్రద్ధ చేయవద్దని అన్నారు. మలేరియా, బోదకాలు, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదడు వాపు కలిగించే దోమలన్నీ ఆడదోమలని చెప్పారు. కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, కొబ్బరి బోండాలు, డిస్పోజల్ గ్లాసులు, రెఫ్రిజిరేటర్లలో నీళ్ల నిలవ లేకుండా చూసుకోవాలని అన్నారు. వీటిలోనే ఎక్కువగా దోమలు ఉంటాయని అన్నారు. దోమతెరలు, వేప ఆకు పొగ వాడాలని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓ ఏ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎంఎల్‌ఏ గోపిరెడ్డి, శాప్‌చైర్మన్ కృష్ణచైతన్య

వివాహ వేడుకల్లో ఎంఎల్ఏ గోపిరెడ్డి

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పాతమాగులూరు వార్త విలేఖరి బలుపునూరి కృష్ణారెడ్డి కుమార్తె అనూష వివాహం ఆదివారం జరిగిన సందర్భంగా అనూషను నర్సరావుపేట ఎంఎల్‌ఏ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శాప్ నెట్ చైర్మన్, అద్దంకి వైసిపి ఇన్‌చార్జి బాచినకృష్ణ చైతన్య ఆశీర్వదించారు. వీరివెంట ఏపిడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, స్థానిక విలేఖరులు, నాయకులు చింతారామారావు, బొల్లినేని రామకృష్ణ, అట్లా పెదవెంకటరెడ్డి, జడ్‌పిటిసి అడవి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండపై టిడిపి మాటలకే పరిమితం

ప్రజాశక్తి - పెద్దారవీడు

మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వెలుగొండ ప్రాజెక్టుపై టిడిపి మాటలకే పరిమితమని, సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డితోనూ ప్రాజెక్టు పూర్తి చేయడం సాధ్యమవుతుందని వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి ఆదిమూలపు సురేష్ యరగొండపాలెం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులే గొబ్బూరు, కలనూతల గ్రామాలలో శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాయని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా 2024లో మళ్లీ తామే గెలుస్తామని అన్నారు. కలనూతల సర్పంచ్ కుర్ర కిర్రానాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు గూడూరి ఎరిక్షన్‌బాబు నియోజకవర్గంలో కనీసం వార్డు సభ్యులకు కూడా ఎవరో తలియదని అన్నారు. సమావేశంలో గొబ్బూరు సర్పంచి అంగిరేకుల ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.

భూ బకాసురుల నుంచి నా స్థలాన్ని కాపాడండి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పురిణి ప్రభావతి

భూ బకాసురుల చేతిలో కబ్జాకు గురైన తన స్థలాన్ని కాపాడాలని ఒంగోలు నగరానికి చెందిన మహిళ పురిణి ప్రభావతి కోరారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్‌లోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట వద్ద సర్వే నెంబర్ 190/2లో తన రెండు ఎకరాల భూమిని మినిశెట్టి శ్రీనివాసరావు, మన్నె నరసింహారావు అనే వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. భూమి తమది అంటూ మామిడిపాలెంకు చెందిన కొంతమందిని తెచ్చి తన స్థలంలోని బోర్డులు, ఫెన్సింగ్ తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను తాలుక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అన్నారు. తాలుకా పోలీసులు, సంతనూతలపాడు తహసిల్దార్ విచారణ చేసి స్థలం తనదేనని రిపోర్టు ఇచ్చారని అన్నారు. తన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తన భూమి కోసం న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు.

భవిష్యత్తుకు భరోసా టిడిపితోనే : కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

కరపత్ర ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

అభివృద్ధికి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరాలంటే టిడిపి తోనే సాధ్యమని, భవిష్యత్తుకు భరోసా టిడిపి అని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు మేరకు మహానాడు, మహాశక్తి మినీ మేనిఫెస్టోలోని పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ బొడ్డురాయి వద్ద నుండి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. తల్లికి దీవెన, ఉచిత దీపం సిలిండర్లు వంటి పదకాలు వివరించారు. ఈ కార్యక్రమంలోటిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, గోలి దుర్గాప్రసాద్, చెన్నుపాటి శ్రీకాంత్, పంచుమర్తి శ్రీనివాసరావు, జొన్నాదుల వెంకటసుబ్బారావు, జొన్నాదుల వరప్రసాద్, అనుముల వీరయ్య, షేక్ బాబు, షేక్ ముషాయర్, షేక్ మున్ని, షేక్ తాహిర్, షేక్ ఆషా, చినిగే సౌభాగ్యలక్ష్మి, షేక్ లాల్ అహ్మద్, శింగిరేసు కాళిదాస్, జంగిలి భాస్కర్, లావేటి శ్రీనివాసతేజ, షేక్ కరిముల్లా, బుర్ల రోశయ్య, వడ్లమూడి ప్రభాస్, షేక్ రబ్బానీ, నందం లావణ్య, బుర్ర కవిత, యర్ర శివనాగ మల్లేశ్వరి, బుద్ధి దుర్గా మల్లేశ్వరి, దేవన విజయలక్ష్మి, పడవల లలిత, ఆకురాతి సుజాత, తిరువిధుల నారాయణమ్మ, తిరువీధుల పద్మజ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సెయింట్ జేవియర్స్‌లో 50సంవత్సరాల క్రితం ఒకటో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ఏ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం కలుసుకున్నారు. యోగ గురువు పతాంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మిత్రుడు, మాజీ ఎఎంసి ఛైర్మన్ అయినాబత్తిన ఘనశ్యామ్ తమ క్లాస్‌మేట్ అవ్వటం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఘనశ్యామ్‌ను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో పూర్వపు విద్యార్థులందరూ స్కూలు అవసరాల కోసం సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, హెడ్ మాస్టర్ కాంటా కోటేశ్వరరావు, వ్యాపారవేత్త శేషాచారి, మాజీ సైనిక అధికారి ఆంజనేయులు, ఐపిఆర్ ఫోటోగ్రాఫర్ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పిసిపల్లి

యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి యోగ పోటీలలో పెదవరిమడుగు విద్యార్థి స్వర్ణ యశస్విని ద్వితీయ స్థానం, మదుల ప్రథమ స్థానం, కె సాయి సహస్ర ద్వితీయ స్థానం, పిసి పల్లికి చెందిన ఏడుకొండలు, రేవంత్ సాయి బాలుర విభాగంలో ద్వితీయ, తతీయ స్థానాలు, సాయి సంజయ్ ద్వితీయ స్థానం, టి గణేష్ ద్వితీయ స్థానం పొందారు. వీరికి శిక్షణ ఇచ్చిన యోగా గురువు స్వర్ణ రమణయ్యలను ఎంఇఒ జి సంజయ్, ఆర్ నివాసులు, పిసిపల్లి హెచ్‌ఎం డేగ ఆంజనేయులు, పెదవరిమడుగు ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం ఎలిజబెత్‌రాణి అభినందించారు. విజేతలు సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని రమణయ్య తెలిపారు.

కోటయ్య వృద్ధాశ్రమానికి సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేస్తున్న వాకర్స్

పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పిఎం హై స్కూల్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌వి సుబ్బారావు సహకారంతో కోటయ్య వృద్ధాశ్రమానికి నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. అవసరంలో ఉన్నవారికి సహాయం చేసే లక్షణం అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, చింతా అప్పారావు, శీరాం రమేష్, చింతా రమేష్, గుర్రం బదిరి, ఎంఎస్ చారుగుళ్ళ ప్రసాద్, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, వాకింగ్ మిత్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నగరం

వైద్యశిభిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గోగినేని బుల్లియ్య కుమారుడు రవీంద్రబాబు, కుమార్తె కమలిక సహకారంతో విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ వైద్యులచే మండలంలోని మంత్రిపాలెంలో ఉచిత సూపర్ స్పెషలిటీ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుండె జబ్బులు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన పరీక్షలు, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. బీపీ, షుగరు, ఈసీజీ, టు డి ఎకో, మామోగ్రామ్ వంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని రేపల్లె డిఎస్‌పి టి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న మణిపాల్ హాస్పిటల్ యాజమాన్యానికి, ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ బాపట్ల జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్యకు అభినందనలు తెలిపారు. వీరరాఘవయ్య మాట్లాడుతూ శిభిరం ఏర్పాటు చేసిన గోగినేని రవీంద్రబాబు, కమలికకు, డాక్టర్ల బృందానికి ధన్యవాదాలు తెలిపారు. మణిపాల్ హాస్పిటల్స్ డాక్టర్ శివకోటేష్, డాక్టర్ ఇమ్మానుయేల్, డాక్టర్ లక్ష్మీ ప్రియాంక వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు అడుసు మల్లి ప్రభాకరరావు, సయ్యద్ కరిముల్లా, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వంశీ, లక్ష్మణ్ పాల్గొన్నరు.

ప్రభుత్వ సంస్థల్లోని

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెవిఫ్.బాబు కోరారు.ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కెఫ్.బాబుమాట్లాడారు. నిరుద్యోగ సమస్యపై ఈనెల 25న విజయవాడలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలోరాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో నిరుద్యోగంపై చర్చించి భవిష్యత్తులో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. మెగా డిఎస్‌సి ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో,జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులు 70 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సులో డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఎ.ఎ. రహీం,ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు,డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పిల్లి విజయ్ కుమార్, శీలం ప్రేమ్‌కుమార్, దేవరాజ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి సురేష్

వివాహ వేడుకల్లో మంత్రి సురేష్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని లహరి పంక్షన్ హాలులో సింగా నాగేశ్వరరావు కుమార్ కిరణ్ కుమార్, దిపిక వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు అబ్దుల్ మజీద్, జోగి వెంకట నారాయణ, అల్లు ఆంజనేయరెడ్డి, నాగేశ్వరరావు,పాల్గొన్నారు.

డాక్టర్ బాలయ్యను సన్మానిస్తున్న నాయకులు

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-పొదిలి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్‌పి. బాలయ్య ఉత్తమ జిల్లా వైద్యాధికారిగా ఈనెల 15న అవార్డు అందుకున్నారు. అందులో భాగంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో బాలయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల జెవివి ప్రధాన కార్యదర్శి ఐజాక్, పొదిలి మండల జెవివి ప్రధాన కార్యదర్శి దేవ ప్రసాద్, వాసన్ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి, జై కృష్ణ, పింఛనర్ల సంఘం సంఘం అధ్యక్షులు బాదుల్లా, శ్రీనివాసరావు, గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షులు చిట్టంచర్ల వెంకట కష్టారావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అమీర్‌కు అశోక్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి-అర్ధవీడు

మండల పరిధిలోని దొనకొండ గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి షేక్ అమీర్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు అమీర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేశారు.

'చదవడం-నాకిష్టం'

టంగుటూరు :విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం మరింతగా పెంపొందుతుందని గ్రంథ పాలకుడు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. టంగుటూరు గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు వర్ధన రాజు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పాకలలో టిడిపి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సర్పంచి ఉప ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి సైకం చంద్రశేఖర్ విజయం సాధించారు. అందులో భాగంగా పాకల పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో ఆదివారం రాత్రి విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ పాల్గొని భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో పాకల అభివృద్ధి చెందినట్లు తెలిపారు. టిడిపి విజయానికి సహకరించిన పాకల ప్రజలకు అభినందనలు తెలిపారు. దామచర్ల సత్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో దామచర్ల ఆంజనేయులు మంత్రిగా ఉన్నప్పుడు పాకల గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలు జోలికొస్తే ఇక సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య చీమకుర్తి కృష్ణ, సర్పంచి సైకం చంద్రశేఖర్, బత్తుల రాజగోపాల్ రెడ్డి, పాకల క్లస్టర్ ఇన్‌ఛార్జి మించల బ్రహ్మయ్య, షేక్ సంధాని బాషా, షేక్ సనావుల్లా , మండలపు గాంధీ చౌదరి, నక్క బ్రహ్మేశ్వరరావు, గాలి హరిబాబు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి- ఒంగోలు

సిఐటియు జిల్లా నాయకుడు గంటెనపల్లి శ్రీనివాసులు కుమారుడు వెంకట భరత్ సుందర్, నాగలక్ష్మి వివాహ వేడుకలు ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిఐటియు నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న సయ్యద్ హనీఫ్, తదితరులు

విగ్రహ ప్రతిష్టలో బూచేపల్లి కుటుంబం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో గుండ్లకమ్మ నది ఒడ్డున శ్రీ దుర్గ చెన్న మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచెన్న మల్లేశ్వర సాహిత దుర్గా మాత, మహా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర సాహిత పరివార దేవత, జీవ ధ్వజ ప్రతిష్ఠ మహా కుంబాభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ బ్రహ్మ శ్రీ త్రిపురారి భట్ల శ్రీనివాస మూర్తి, ఆయన శిష్య బందం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివ ప్రసాద్ రెడ్డి, ఆయన సతీమణి నందిని, కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం బూచేపల్లి సుబ్బారెడ్డి వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శివ ప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి నందిని అన్నదానం నిర్వహించారు దేవాలయం, విగ్రహ మూర్తుల ప్రతిష్ఠ సందర్భంగా విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలకరించారు. దేవాలయం వద్ద నిర్వాహకులు సాంసతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పూజలు నిర్వహిస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

బాలినేని దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బాలినేనికి ఆహ్వానం

అర్ధవీడు : గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకుడు, రాజన్న క్యాంటీన్ వ్యవస్థాపకుడు కామూరి రమణారెడ్డి ఈనెల 27 నూతన గృహ ప్రవేశ వేడుకలు నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులను ఒంగోలు లోని వారి స్వగృహం ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన గృహ ప్రవేశ ఆహ్వాన పత్రిక అందజేశారు.గృహ ప్రవేశ వేడుకలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి చెన్ను విజయ, కొమరోలు ఎంపిపి కామూరి అమూల్య, బేస్తవారిపేట ఎంపిపి ఓసూరారెడ్డి, అర్ధవీడు మాజీ ఎంపిపి పురుషోత్తం రెడ్డి, అగ్గి పుల్లా రెడ్డి,శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

320 మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో శ్రీకమ్మవారి శ్రీరామమందిరం కమిటీ వారి సహకారంతో ఒంగోలు ఉపాస్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో గుండె ,ఊపిరి తిత్తులు, కీళ్ళు, మెదడు, నరాలు, స్త్రీల వ్యాధులు, పక్షవాతం తదితర వ్యాధులు, బిపి షుగర్ ,ఇసిజి లాంటి పరీక్షలు 320 మందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చవల ప్రకాష్ , డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ చివుకుల శ్రీధర్ , డాక్టర్ జోత్స్న, డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, వైద్య శిబిరం నిర్వాహకులు బెల్లం సీతారామయ్య, కాట్రగడ్డ చంద్రబాబు, గోగినేని ఆంజనేయులు, కనగాల శ్రీను , పి.సెల్వం, టి.జాన్సన్, విక్రాంత హెల్త్ సూపర్ వైజర్ నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తదానం

చీమకుర్తి : భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో 8మంది గర్భి ణులకు ఆదివారం రక్తదానం చేశారు. గర్భిణులకు ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కావడంతో బ్లడ్ డోనర్స్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ బుట్టి కిరణ్, దుర్గారావు, నాగమణి, రుద్ర,సుబ్బారావు, అభిరామ్, నరేంద్ర,గోపి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గర్భిణుల కుటుంబ సభ్యులు భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి జి దేవరాజు మాట్లా డుతూ చీమకుర్తి మండలం చుట్టుప్రక్కల ప్రజలు అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు 90107 29130 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

బాపట్ల : భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 73వ జయంతి బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, దోనేపూడి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన 'నైస్' విద్యార్థులు

మార్కాపురం : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) ఆదివారం విడుదల చేసిన కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగ ఫలితాలలో మార్కాపురంలోని నేతాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (నైస్)లో శిక్షణ పొందిన శిద్దా అనిత సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), కొర్రా శ్రీరాముల నాయక్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్)లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు నేతాజీ ఇనిస్టిట్యూట్ గౌరవ సలహాదారులు కొత్తేర్వ కాశిరెడ్డి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఇనిస్టిట్యూట్ అధ్యాపక బృందం తారక్, శేషు, రమణారెడ్డి, గౌతమ్, వీరభద్రారెడ్డి, ఫణికుమార్, ఫణీంద్రారెడ్డి అభినందనలు తెలిపారు.

వివాహ వేడుకల్లో దారపనేని

పామూరు : పామూరు పట్టణ సిపిఐ నాయకులు వజ్రాల సుబ్బారావు, అంకమ్మ దంపతుల కుమారుడు సురేంద్రబాబు, వెంకట సుమ వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, తిరివీధి జనార్దన్, పామూరు మండల మాజీ కోఆప్షన్ మెంబర్ షేక్ ఖాదర్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

శింగరాయకొండ : స్థానిక కందుకూరు రోడ్డులోని కీర్తి మెడికల్స్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్టెంట్ గుండె, షుగర్ మరియు నరముల వైద్య నిపుణులు డాక్టర్ బాబూరావు, డాక్టర్ కళ్యాణ్ రక్తపోటు, డయాబెటిస్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి తగు వైద్య పరమైన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాలె రంగారెడ్డి, జెట్టి సూర్యచంద్రశేఖరరెడ్డి, పంతగాని వెంకటేశ్వర్లు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన

పెద్దదోర్నాల : పెద్దదోర్నాలలోని ఎస్‌సి,ఎస్‌టి, బీసీ వసతి గృహాలు, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యాగ్నిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ యాగ్నిక్ మాట్లాడుతూ ప్రజలు దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలను వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపూర్ డివిజన్ సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, మలేరియా సూపర్ వైజర్ ఇజ్రాయిల్, బీసీ హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీ నాయక్, ఎస్‌సి హాస్టల్ వార్డెన్ లక్ష్మీనాయక్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ టీచర్ తులసి నాయక్, ఎఎన్ఎం కె.నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **బాపట్ల :** దోమ కాటుకు గురై మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. విజయమ్మ తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవ సందర్భంగా బాపట్ల పట్టణంలో దోమ కాటు వల్ల కలిగే అనర్థాలను ప్రజలు ప్రజలకు తెలియజేసే నినాదాలు చేస్తూ బాపట్ల పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై. రాజ్ కుమార్ ,జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి టి. వెంకటేశ్వరరావు, పట్టణ హెల్త్ సూపర్ వైజర్ జూగుంట రాంబాబు, ఎఎన్ఎంలు,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

డాక్టర్ బి.హరిబాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శింగరాయకొండలోని లోటస్ హైస్కూల్‌లో శాస్త్రీయ దక్పథ దినోత్సవం అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్.సునీల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.హరిబాబు మాట్లాడుతూ ప్రతివిద్యార్థి, ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. సజనాత్మక ఆలోచనలు పెంపొందించుకొనేందుకు కషి చేయాలన్నారు. మూఢ విశ్వాసాల నిర్మూలనకు, జీవితాంతం కషి చేసిన, డాక్టర్ నరేంద్ర అచ్యుత దభోల్కర్ అమరుడైన రోజు, ఆగస్టు 20, జాతీయ దక్పథ దినోత్సవం దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మూఢ విశ్వాసాల నిరోధక చట్టం మహారాష్ట్రలో వచ్చింది. ఆ తర్వాత ఈ చట్టం కర్ణాటకలోనూ వచ్చింది. ప్రజలను మోసగిస్తున్న దొంగ బాబాలకు వ్యతిరేకంగా, నరబలులు, క్షుద్ర పూజలు, చేతబడులు పేరుతో జరుగుతున్న మోసాలను బట్టబయలు చేసిన డాక్టర్ నరేంద్ర అచ్యుత దభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న వాకింగ్ సమయంలో మతోన్మాదులు హత్య చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. మూఢనమ్మకాలు, శాస్త్రీయ దక్పథం కలిగి ఉండాలన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కోటపాటి నారాయణ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ ఎం.నరసింహారావు, విశ్రాంత ఉపాధ్యాయులు నర్రా యలయంద, పిచ్చమ్మ, భాస్కర్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిబాబు

యువగళం పాదయాత్రకు వేగేశన సంఘీభావం

ప్రజాశక్తి- బాపట్ల

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కష్ణ జిల్లాలోకి ఆదివారం ప్రవేశించింది. ఈ సందర్భంగా టిడిపి బాపట్ల ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ నారా లోకేష్‌కు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర 2,500 కిలో మీటర్లు పూర్తయిన సందర్భంగా నారా లోకేష్‌కు నరేంద్రవర్మ శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ గ్రామీణ ప్రాంతంలో యువగళం పాదయాత్ర ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న నరేంద్ర వర్మ గన్నవరంలో నిర్వహిస్తున్న బహిరంగ సభ విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టిడిపి నాయకులతో చర్చించారు.

పాదయాత్రలో పాల్గొన్న వేగేశన నరేంద్ర వర్మ

టిడిపి నాయకులను సన్మానిస్తున్న సర్పంచి చంద్రశేఖర్

టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ సర్పంచిగా గెలుపొందిన సైకం చంద్రశేఖర్ కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణను ఆదివారం కలిసి సన్మానించారు. టిఇపి గెలుపు కోసం కషి చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మూలగుంటపాడు పంచాయతీ 10వ వార్డు మెంబరుగా గెలుపొందిన అంబటి శ్రీనివాసరావు కూడా నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నెబోయిన శ్రీనివాస్‌నాయుడు, చిగురుపాటి శేషగిరి, గుదే వెంకటేశ్వర్లు, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్శి ప్రసాద్‌రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల షాదీఖానాకు మహర్దశ

అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలోని షాదీ ఖానాకు మహర్దశ కలగనుంది. షాదీఖానాను అభివద్ధి చేసేందుకు పూర్తి బాధ్యత తీసు కోవాలని బాపట్ల అంజుమన్ కమిటీ సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది. బాపట్ల అంజుమన్ కమిటీ సమావేశం అధ్యక్షుడు జిలాని అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో షాదీ ఖానా అభివద్ధి పై అంజుమన్ కమిటీ స్పందించింది. పూర్తి బాధ్యత తాము తీసుకుంటామని ప్రకటించింది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ షాదీఖానా గత కొన్నేళ్లుగా అభివద్ధికి నోచలేదు. షాదీ ఖానా అభివద్ధి బాధ్యతను తమకు అప్పగించాలని బాపట్ల అంజుమన్ కమిటీ మున్సిపల్ అధికారులకు విన్నవించింది. దీంతో పురపాలక సంఘం ద్వారా అంజుమన్ కమిటీకి అనుమతి పత్రాన్ని అందజేశారు. తహశీల్దారు పర్యవేక్షణలో దీని అభివద్ధికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకునేలా ఆ కమిటీకి అవకాశం కల్పించారు. షాదిఖానాను అభివద్ధి చేసేందుకు అంజుమన్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ స్పందించారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ షాదీ ఖానా అభివద్ధికి అవసరమైన సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. బాపట్ల షాది ఖానా అభివద్ధి కోసం తన వంతు సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తానని అంజుమన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చీమకుర్తి కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ సమావేశంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి కరీం, సభ్యులు రఫీ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజుమన్ కమిటీ చైర్మన్ జిలాని


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నేత తాటిపర్తికి సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ 16వ వార్డు ఉపఎన్నికలో వైసిపి బలపరచిన అభ్యర్థి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆ పార్టీ సీనియర్ నేత తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఆదివారం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన వార్డు సభ్యురాలు షేక్ సాబిరా, ఎంపిటిసి షేక్ హఫీజాబేగం, వైసిపి నాయకులు నౌషాద్ బాషా, మహబూబాషా తదితరులు వైసిపి గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రాయిపేర్రాజు, సవలం కోటేశ్వరరావు, జాన్, కిషోర్, అనీల్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ నగర్‌లో నూతన అపార్టుమెంట్ నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. జార్జి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఎ.సతీష్ ఆర్.ఆర్ అంబరం పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ క్రెడాయ్ సభ్యత్వం కలిగిన ఆర్.ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ మార్కాపురంలో ఇలాంటి మంచి నిర్మాణాన్ని చేపట్టడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునా రెడ్డి, అన్నా వెంకట రాంబాబు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ పి.కేశవరావు, కందుల ఒబులరెడ్డి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి, యర్రగొండపాలెం ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఐఎంఎ నాయకులు డాక్టర్ మాధవరావు, డాక్టర్ వంశీకృష్ణ, కమలా విద్యా సంస్థల సెక్రెటరీ పి.పవన్ కుమార్, ఆర్.ఆర్ డెవలపర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో మంత్రి డాక్టర్ సురేష్

22న మండల సమావేశం

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపిపి అత్తాల జక్షన్న అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, జడ్‌పిటిసి, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఒక్క ఓటు కూడా తీయనివ్వను

కార్యకర్తల సమావేశంలో ఎంఎల్ఎ ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అభివద్ధి, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి అడ్డగోలుగా సహజ వనరులు దోచుకుంటున్న జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టు కుందని పర్చూరు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓట్టేయరనే భయంతోనే అడ్డదారిలో గెలిచేందుకు ప్రత్యర్థి పార్టీల మద్దతుదారుల ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇసుక దర్శిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇసుకను దొరకుండా చేసి సామాన్యులు అందుకోలేని విధంగా ధరలు పెంచారని అన్నారు. మద్యనిషేధం చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు ప్రభుత్వమే మద్యం దుకాణాలు తెరిచి దోపిడీ చేస్తున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్, కొకైన్ వంటి విష పదార్థాల వ్యాపారంతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. పర్చూరు

నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎంఎల్ఎ ఏలూరి

నియోజకవర్గంలో దొంగ ఓట్లు ఉన్నాయని మూడు నెలలుగా ప్రచారం చేసి నేడు 10వేల ఓట్లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అధికారులే వైసిపి కార్యకర్తల్లా పనిచేసే పరిస్థితిలో ఉన్నారని అన్నారు. ఓట్ల తొలగింపు కుట్రలపై తాను అప్రమత్తంగానే ఉన్నానని అన్నారు. ఈపాటికే రెండుసార్లు పూర్తి ఆధారాలతో కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు తెలిపారు. వైసిపి అధికార కుట్రలో ప్రజాస్వామ్య హక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రమాదంలో పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో పర్చూరు నుండి టిడిపికి 25వేల మెజార్టీతో పసుపు జెండా ఎగురేస్తామని అన్నారు. ఓట్ల తొలగింపు అక్రమాలకు పాల్పడిన అధికారులకు బుద్ధి చెబుతామన్నారు. న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తొలుత టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి చీరాల ఇంచార్జ్ ఎంఎం కొండయ్య, టిడిపి మండల అధ్యక్షులు నల్లపునేని రంగయ్యచౌదరి, పోద వీరయ్య, నాయుడు హనుమంతరావు, షేక్ షంషుద్దీన్, తిరుమలశెట్టి శ్రీహరి, తాటి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

గుంటూరు ఛానల్ కోసం సదస్సు

ప్రజాశక్తి - పర్చూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ ఈనెల 22న పర్చూరు కొల్లవారి కళ్యాణ మండపంలో అఖిల పక్ష సాధన సమితి ప్రతినిధులు తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు ఛానెల్ పర్చూరు వరకు పొడిగిస్తే ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లోని 50శాతం గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందుతుందని తెలిపారు. నాలుగు మండలాల రైతులతో సాధన సమితిగా ఏర్పడినట్లు తెలిపారు. సదస్సుకు ఎంఎల్‌సి కెవిఎస్ లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరు కావాలని కోరారు. నరిశెట్టి ఆచార్యులు, బండి శంకరయ్య, లావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరంలో ఈనెల 21న సోమవారం ఉదయం 9 గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మాజీ జెడ్పిటిసి కుక్కపల్లి ఏడుకొండలు, ఆంజనేయులు వారి తల్లి కుక్కపల్లి అంజమ్మ పెదకర్మ సందర్భంగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ ఆఫీస్ వద్ద గల సొసైటీ బిల్డింగు దగ్గర శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం, ఎడమ చేయి లాగటం, ఎక్కువ కాలంగా బిపి, షుగర్ ఉన్నవారికి, ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు, ఈసీజీ, ఈసిహెచ్ఓ (ఎకో) స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియో గ్రామ్ పరీక్ష చేసి ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. ద

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

స్థానిక పంచాయతీ కార్యాలయం నందు నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రమీజ్ అహ్మద్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు ఎల్లారెడ్డి కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. 60ఏళ్ల దాటిన వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తామన్నారు. శుక్లములు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఈనెల 24న పెదకాకాని శంకర్ హాస్పిటల్‌లో ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి పరీక్షలు అవసరమైన వాళ్లు ఆధార్, ఫోన్ నెంబర్లతో వైద్యశిభిరానికి హాజరు కావాలని కోరారు.

దళితులకు ఆహ్వానం లేదా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తనకు ఆహ్వానం లేకపోవటం ఏమిటని సురేపల్లి ఉప సర్పంచ్ వాసు వాపోయాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను దళితుడను కావటం వల్లనే ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపించాడు. సర్పంచ్ పేరును ఆహ్వాన పత్రికలో ప్రచురించిన అగ్రకుల నాయకులు దళితుల పట్ల చిన్నచూపు సుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాను కూడా అధికార పార్టీ నుండి గెలుపొందిన వాడినేనని అన్నారు. ఎస్‌సి నియోజకవర్గమైనప్పటికీ గ్రామాల్లో అగ్రకుల పెత్తందారులే అధికారం చెలాయిస్తూ తమను అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

చిన్నారులకు ఎంఎల్ఎ గొట్టిపాటి ఆశీర్వాదం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని నాగులపాడుకు చెందిన ధూళిపాళ్ల సుబ్బారావు, వెంకాయమ్మ దంపతుల కుమారుని వివాహం పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మండపంలో వివాహ వేడుకకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్ హాజరై వధూవరులు శ్రీకాంత్, సాయి భావనలను ఆశీర్వదించారు. కొత్తరెడ్డి పాలెంలో అంబటి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ కుమారుని వివాహ మహోత్స వానికి హాజరై వధూవరులు వెంకట క్రిష్ణారెడ్డి, సంధ్యలకు ఆశీస్సులు తెలిపారు. నాగులపాడుకు చెందిన మందపల్లి నాగేశ్వరరావు, సుజాత దంపతుల కుమారుని వివాహానికి హాజరై వధూవరులు సూర్య తేజకు ఆశీస్సులు తెలిపారు.

చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

పంగులూరు : కస్యాపురంలో ఉప్పుటూరి వారి వివాహానికి హాజరై ఎంఎల్ఎ రవికుమార్ వధువు గౌతమికి ఆశీస్సులు తెలిపారు. ముప్పవరంలో గోనుగుంట్ల మనోహర్ బాబు, శ్రావణి దంపతుల కుమారుడు, కుమార్తె వస్త్ర బహుకరణ, ఓణీల వేడుకకు హాజరై చిన్నారులు సాయి సందీప్, చారున్యను ఆశీర్వదించారు. భూలక్ష్మి, ఏడుకొండలు (లేటు) దంపతుల కుమారుడు వెంకటేశ్వరరావు వివాహానికి హాజరై వెంకటేశ్వరరావును ఆశీర్వదించారు. కళ్ళంవారిపాలెం వాస్తవ్యులు కట్టా చెంచిరెడ్డి, వెంకటరత్నం దంపతుల కుమారుడు బ్రహ్మారెడ్డి వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన చైల్డ్‌రైట్స్ ఫౌండేషన్

గ్రామాల్లో సోలార్ స్ట్రీట్ లైట్లు

ప్రజాశక్తి - రేపల్లె

చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం సోలార్ స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని బొబ్బర్లంక, రావి అనంతవరం, పెనుమూడి, చోడాయపాలెం, పిరాట్లంక, పోటుమెరక, కారుమూరు, విశ్వేశ్వరం గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో సోలార్ స్ట్రీట్ లైట్లు అమర్చామని అన్నారు. తమ ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు.

నిరుపేద కుటుంబానికి ఐక్యవేదిక సహకారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో నివాసముంటున్న కొండా నాగార్జున, అంకమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు. వీరిలో ఇద్దరూ పిల్లలు అంగవైకల్యంతో జన్మించారు. అంగవైకల్యం కలిగిన ఇద్దరిలో ఒక బాబు ఇటీవల మరణించాడు. ఇప్పుడున్న ఇద్దరు పిల్లలో ఒకరు జన్మతరహా అంగవైకల్యంతో ఉన్నాడు. భర్త నాగార్జున అనారోగ్యంతో మంచంపట్టాడు. కుటుంబానికి భార్య అంకమ్మ పెద్దదిక్కు అయింది. కుటుంబాన్ని పోషించటంలో అంకమ్మ సంపాదన చాలీచాలనట్లు జీవనం కొనసాగిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షులు జ్యోతి

నిత్యావసరాలు అందిస్తున్న ఐక్యవేదిక నేతలు

రమేష్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సహచరులతో చర్చించారు. దాతలు ముందుకు వచ్చి కుటుంబానికి అవసరమైన బియ్యం, నిత్యవసర సరు కులను, కొంత నగదును సమకూర్చి ఆ కుటుంబానికి అందించారు. జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ నాగార్జున ఆధార్, రేషన్ కార్డు అన్నీ గత 7 సంవత్సరాల నుండి అద్దంకిలోనే ఉన్నాయని అన్నారు. వారికీ సొంత ఇల్లు కూడా లేదని అన్నారు. కనుక అధికారులు వెంటనే జగనన్న కాలనీలో స్థలం కేటాయించి ఇల్లు కట్టించాలని కోరారు. అలాగే ధాత్రుత్వం గల పెద్దలు తమవంతు సాయన్ని అందించాలని కోరారు. ఆ కుటుంబాన్ని భవిష్యత్లో తమ వంతు ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యాక్రమంలో ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, 30వ వార్డ్ కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, ఐక్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరావు, ఉపాధ్యక్షులు అంకం నాగరాజు, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు బుజ్జి కొమ్మాలపాటి, సభ్యులు జ్యోతి డేవిడ్, మంచు హనుమంతరావు, కృష్ణ, బండారు చంటిబాబు, కుమారి, మంగమ్మ పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ సభ్యులు సోమేపల్లి రామమోహనరావు సతీమణి లక్ష్మీకాంతం 3వ వర్ధంతి సందర్భంగా గంగవరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అవసరమైన రూ.4వేల విలువైన నిత్యావసర సరుకులు, ఫలాలు అందజేశారు. తోటివారికి సహాయం చేయాలనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో రోటరీ ఉపాధ్యక్షులు అలవల శ్రీనివాసరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, లక్ష్మి కాంతం కుమార్తె ఝాన్సీలక్ష్మి, అల్లుడు పోపూరి శేషగిరిరావు, ఆశ్రమము నిర్వాహకులు బొడ్డు వరప్రసాద్ పాల్గొన్నారు. రోటరీ సభ్యులు రామమోహనరావు సేవలను అభినందించారు.

సాంకేతికతపై విషప్రచారం చేస్తున్న సైన్సు వ్యతిరేకులు

జెవివి రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి

ప్రజాశక్తి -రాచర్ల

ఒకవైపు చంద్రయాన్ త్రీ విశ్వంలోకి దూసుకెళ్లి విజయ దరహాసం చిందిస్తుంటే, మరొకవైపు సైన్స్ వ్యతిరేక శక్తులు విష ప్రచారాన్ని చేస్తు, మూడ నమ్మకాలతో ఉర్రుగుతున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూప రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల స్పందన ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జాతీయ శాస్త్రీయ దకృథ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మూఢ నమ్మకాలు లేని ఉన్నత సమాజం కోసం పాటుపడే గొప్ప హేతువాది, డాక్టర్, రచయిత, సామాజిక ఉద్యమనేత ధబోల్కర్‌ను చంపారన్నారు. జెవివి జిల్లా అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, స్పందన విద్యాసంస్థల డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ముందుగా డాక్టర్ నరేంద్ర ధభోల్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాచర్ల మండల కమిటీనీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పేర్ల పరమేశ్వర్ రెడ్డి, అధ్యక్షులుగా వలసాని శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా షేక్ అచ్చు కట్ల ఖాజావలి, ప్రధాన కార్యదర్శిగా పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, కోశాధికారిగా జే సుధాకర్,

ధబోల్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యదర్శులుగా ఎస్ మధుసూదన్ రెడ్డి, శివ ప్రసాద్, బి గోపాల్ రెడ్డి, డికెవి శివప్రసాద్, సాంస్కృతిక విభాగ కన్వీనర్ గా ఎం శ్రీనివాసు లతోపాటు ఐదు మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు డీజీ బ్రహ్మానంద రెడ్డి, డి వెంకటేశ్వర్లు , ఎవిశ్వరూప చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పార్ట్‌టైమ్ ఉద్యోగం'

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న కొత్త సైబర్ నేరాల గురించి జిల్లా ఎస్పీ ఆదివారం వివరించారు. ఇటీవల వేటపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్త రకమైన సైబర్ నేరం వెలుగులోకి వచ్చిందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే బాధితుడి మొబైల్ వాట్సప్ నెంబర్‌కు పార్ట్ టైం జాబ్ అని వచ్చిన సందేశాన్ని క్లిక్ చేయగా, సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపి అందులో వున్న ప్రొడక్ట్ ను క్లిక్ చేసి స్క్రీన్ షాట్ తీసి సెండ్ చెయ్యాలని తెలపడంతో బాధితుడు వారు చెప్పిన విధంగా చెయ్యడంతో రూ.150 అతడి ఖాతాలో జమ చేశారు. తరువాత సైబర్ నేరగాళ్లు అతడిని ఒక టెలిగ్రామ్ గ్రూప్‌లోకి యాడ్ చేశారు. ఆ గ్రూపులో వచ్చిన లింక్ లను క్లిక్ చేస్తే టాస్క్ లు వస్తాయని వాటిని ఉచితంగా ట్రేడింగ్ చెయ్యవచ్చుని.. తెలిపి టాస్క్‌లు నిర్వహించి గెలుపొందిన సొమ్ముని స్క్రీన్ షాట్ తీసి గ్రూప్‌లో, రిసెప్షనిస్ట్‌కు పంపిన తరువాత ఆ డబ్బులు అతడి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. మొదట చిన్న మొత్తంలో వారి అకౌంట్‌లలో డబ్బులు జమ చేయించుకొని.. టాస్క్‌లు నిర్వహించి గెలిచిన సొమ్ము మొత్తాన్ని తిరిగి బాధితుడి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. బాధితుడు నేరగాళ్ళ పట్ల పూర్తి విశ్వాసం కలిగే విధంగా చేసి ఆ తరువాత విడతల వారీగా రెండు, మూడు దశలలో టాస్క్‌లు నిర్వహించి బాధితుడి వద్ద నుండి ఎక్కువ మొత్తంలో సైబర్ నేరగాళ్ల ఖాతాలో సొమ్మును జమ చేయించి, ఆ మొత్తం సైబర్‌నేరగాళ్లు రూపొందించిన నకిలీ వెబ్సైట్లో చూపుతూ, గెలిచిన సొమ్ము బాధితులు ఖాతాలో జమవ్వాలంటే మరికొంత సొమ్ము జమ చేసి టాస్క్ ఆడితే కానీ సొమ్ము బాధితుని ఖాతాలో జమ అవ్వదని చెప్పారు. సుమారు రూ.10 లక్షలు బాధితుడి వద్ద నుండి సైబర్ నేరగాళ్లు దోచుకున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇలాంటి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని ఎన్‌ఆర్‌అండ్‌పిఎం హైస్కూల్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌వి సుబ్బారావు సహకారంతో కోటయ్య వద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకష్ణ, వలివేటి మురళీకష్ణ, చింతా అప్పారావు, శీరాం రమేష్, చింతా రమేష్ పాల్గొన్నారు.

'ట్రెజరీ' సేవలు సులభతరం..

- బాపట్ల జిల్లా ఏర్పాటుతో పెన్షనర్లకు అందుబాటులో కార్యాలయం
- కంప్యూటరీకరణతో సత్వరమే సేవలు..
- జిల్లా ఖజానా అధికారి శివకామేశ్వరి

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో ప్రభుత్వ విభాగాల్లో ఖజానా శాఖ అత్యంత కీలకమైందని, బాపట్ల జిల్లా ఏర్పాటుతో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఖజానా శాఖ సేవలు సులభతరమయ్యాయని బాపట్ల జిల్లా ఖజానా అధికారి రంగిశెట్టి శివకామేశ్వరి తెలిపారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు సత్వరమే వారి ఖాతాలకు జమ అయ్యేవిధంగా జిల్లాలో అన్ని సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీని కంప్యూటరీకరించినట్లు చెప్పారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు అందిస్తున్న ఖజానా శాఖ సేవలపై 'ప్రజాశక్తి'తో జిల్లా ఖజానా అధికారి ముఖాముఖి..

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో ఉద్యోగులకు పెన్షనర్లకు ఖజానా సత్వర సేవలు సులభతరమయ్యాయి. బాపట్ల జిల్లాగా రూపుదిద్దుకోవడం పెన్షనర్లకు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గతంలో జిల్లా ఖజానా సేవలు అవసరమైతే గుంటూరు, జిల్లాలో పలు నియోజకవర్గాల నుండి ప్రకాశం జిల్లా, ఒంగోలుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.

అందుబాటులో ఖజానా కార్యకలాపాలు

బాపట్ల జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, (పూర్వ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన) మార్టూరు, మండల కేంద్రమైన నగరంతో మొత్తంగా 6 సబ్‌ట్రెజరీ(ఉప ఖజానా)లు ఉన్నాయి. బాపట్ల జిల్లా కావడంతో ఖజానా కార్యకలాపాలు మరింత అందుబాటులోకి వచ్చాయి. పెన్షన్ తీసుకునే వద్ధులు వయసు పైబడిన పెన్షనర్లకు జిల్లా ఖజానా కార్యాలయం మరింత అందుబాటులోకి వచ్చింది. అదికాక ఆన్‌లైన్ సిస్టమ్‌తో సెల్‌ఫోన్ ద్వారా ఖజానా సేవల సమాచారం తెలుసుకునేందుకు మరింత సులభతరమైంది.

సత్వరమే సమస్యల పరిష్కారం

జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె, నగరం, మార్టూరు, అద్దంకి సబ్ ట్రెజరీల ద్వారా 9,490 మంది పెన్షన్ సేవలు పొందుతున్నారు. జిల్లాలో రెగ్యులర్ ఎంప్లాయిస్ 15,418 మంది ఉన్నారు. వాలంటీర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు అందే విధంగా సబ్ ట్రెజరీలు సేవలందిస్తున్నాయి. సబ్‌ట్రెజరీల్లో పెన్షన్ ఇతర ఆర్థిక సమస్యలు ఉత్పన్నమైతే జిల్లా ట్రెజరీలో వాటిని సత్వరమే పరిష్కరిస్తున్నాం.

ఆర్టీసీ ఉద్యోగులకూ ట్రెజరీ ద్వారానే..

జిల్లాలో కొత్తగా ఆర్టీసీ ఉద్యోగులకు జీతభత్యాలు ట్రెజరీలు ద్వారానే అందించడం జరుగుతోంది. బాపట్ల జిల్లాలో నాలుగు ఆర్టీసీ డిపోల్లో మొత్తంగా 1100 మంది ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. బాపట్ల డిపోలో 232, రేపల్లె డిపోలో 260, అద్దంకి డిపోలో 320, చీరాల డిపోలో 360 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమయ్యాక ట్రెజరీల ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు అందజేస్తాం. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉద్యోగుల జీతభత్యాలు పెన్షన్లు సత్వరమే వారి ఖాతాలకు జమయ్యేవిధంగా జిల్లాలో అన్ని సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీని కంప్యూటరీకరించాం. అందుకు అవసరమైన కంప్యూటర్లు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. జిల్లాలో సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పెన్షనర్లకు, ఉద్యోగులకు ఏ విధమైన సమస్యలున్నా జిల్లా ట్రెజరీ కార్యాలయంలో తమను సంప్రదించాలి.

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

విశ్వ బ్రాహ్మణులకు

మౌలిక వసతుల కల్పనకు కృషి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు తెలిపారు. స్థానిక సౌత్ బైపాస్‌లోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆదివారం విశ్వబ్రాహ్మణులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు అంజయ్య రోడ్డులో ఆరామ క్షేత్రం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే స్థలం కేటాయించారన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో తొలిసారి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారికి అనేక రకాలైన పనిముట్లు ఇచ్చి తోడ్పడ్డామన్నారు. ఒంగోలు నగరంలో విశ్వ బ్రాహ్మణులకు కల్యాణ మండపానికి తానే స్థలమిచ్చానని తెలిపారు. మరో 8 నెలల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని, విశ్వబ్రాహ్మణులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 80 శాతం పూర్తిచేసిన టిడ్కో గృహాలను నేటికి ఒంగోలు ప్రజలకు అందించపోవటం బాధాకరమన్నారు. తాను వస్తే పట్టాలు ఇస్తానని, గత నాలుగున్నర సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వచ్చేది టీడీపీ పార్టీ ప్రభుత్వమేనని, ఒంగోలు నగరంలో పేద ప్రజలకు అన్ని సదుపాయాలతో అవసరమైన వారికి పట్టాలు, టిడ్కో గహాలు పూర్తి చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మచ్చా బాబు, పతకమూరి సుబ్రహ్మణ్యం, పిఎస్ బాబు, మానేపల్లి గోవిందాచారి, నూతలపాటి ప్రసాద్ మరియు పులివర్తి అజయ్, విశ్వబ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు.

ఊరి బయట వైఎస్‌ఆర్ క్లినిక్‌లు

మహిళా సిబ్బందికి ఇబ్బందులు

- స్థానికంగా నివాసం ఉండకుంటే 30 శాతం జీతం కోత
- అవస్థలు పడుతున్న హెల్త్ క్లినిక్ ఉద్యోగులు

ప్రజాశక్తి-మార్కాపురం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం తరపున మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం మంచిదే. అందులో భాగంగా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పారు. అందులో పనిచేసే సిబ్బంది బాగోగులు, వసతులు కల్పన, వారికి అవసరమైన రక్షణ వంటి చర్యలు మాత్రం ప్రభుత్వానికి పట్టవట.! వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో సిబ్బంది ఒక్కరే కావడంతో ఎంత వరకు సేవలు అందించగలరనే ప్రశ్న తలెత్తుతోంది..!!

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 10032 వైఎస్ఆర్ క్లినిక్‌లను నెలకొల్పారు. జిల్లా వ్యాప్తంగా 538 క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. ఒక్కో క్లినిక్‌కు ఒక్కొక్కరిని(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) మాత్రమే నియమించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్వహణలో ఉండాలి. ప్రజలు అక్కడ ఉన్న ఒక్కరితో సేవలు పొందాలి. హెల్త్ క్లినిక్ సమయం ముగిసిన తరువాత కూడా అందులో పనిచేసే ఆ ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండాలి. హెల్త్ క్లినిక్ వద్ద ఖచ్చితంగా నివాసం ఉండాలని నిబంధన పెట్టారు. సౌకర్యాలు ఉంటే ఉండేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కానీ క్లినిక్‌లు ఎక్కువగా ఊరి బయట ఉంటాయి. ఇందులో పనిచేసే సిబ్బందిలో 85 శాతం మంది మహిళలే. వారిలోనూ ఎక్కువగా అవివాహితులే ఉండటం విశేషం. ఊరి చివరలో హెల్త్ క్లినిక్‌లో ఒక్కరే రాత్రి బస చేయడం అంత శ్రేయస్కరం కూడా కాదు. ప్రభుత్వం మాత్రం పనిచేసే ప్రదేశంలో నివాసం ఉండాలని ఆంక్షలు విధించడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో ఉన్న క్లినిక్‌లైతే ఇబ్బంది లేదు. ఊరి చివరలో నిర్మించిన వాటిలో ఉండటం కొందరికి భయంగా ఉంది. రాత్రివేళ అకతాయిల గోల అక్కడక్కడా జరుగుతోంది. మహిళలు



కావడంతో చెప్పుకోలేకున్నారు. శింగరాయకొండ పరిధిలో ఇటీవలే అగంతకుడు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో పనిచేసే మహిళా ఉద్యోగిపై అసభ్యంగా వ్యవహరించాడు. పోలీస్ కేసు వరకు ఈ అంశం వెళ్లింది. దీనిపై తోటి సిబ్బంది ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. సిబ్బంది మాత్రం బిక్కుబిక్కుమంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

వాస్తవంగా విలేజ్ క్లినిక్‌లతో మూడు సిఫ్టులు ముగ్గురు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. ఒక్కరితో సేవలు అందించడం సాధ్యం కాదు. ప్రభుత్వం సిబ్బందిని పెంచడం జరిగిందంటే... ఖజానా భారం అవుతుందనే సాకుతో ఒక్కరితో నడపాలని చూస్తోంది. ముగ్గురు కాక పోయినా... కనీసం రాత్రి ఒకరు... పగలు ఒకరు చొప్పున పనిచేసేలా సిబ్బందిని నియమిస్తే బాగుంటుందని ప్రజలు కూడా కోరుతున్నారు. ఆ విధంగా అయితే 24 గంటలు విలేజ్ క్లినిక్‌లు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించాలి మరి..!

జీతం కట్..

వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేసే సిబ్బంది వేతనంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వ వాటా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రూ. 25వేలు, కేంద్రం రూ. 15వేలు చెల్లిస్తోంది. క్లినిక్‌ల వద్ద నివాసం ఉండని సిబ్బందికి జీతం 30 శాతం కట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం నుంచి ఇచ్చే జీతంలో 30 శాతం అంటే రూ. 4700 వరకు ప్రతి నెలా తగ్గిస్తోంది. పైగా అక్కడ నివాసం ఉండటం లేదని మెమోలు జారీ చేస్తున్నారు. ఇటీవల కాలంలో 75 మంది వరకు మెమోలు అందుకున్నారు. ఊరి బయట కాకుండా... విలేజ్ క్లినిక్‌లు ఊరిలో ఉంటే తాము నివాసం ఉండేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని సిబ్బంది అంటున్నారు. భయం అంతా ఊరి వెలుపల ఉండటమేనని వాపోతున్నారు.

అద్దెలు వారే భరించాలి..

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు అంతటా సొంత భవనాలు లేవు. ఎక్కువగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి మాత్రం పైసా కూడా అద్దె చెల్లించడం లేదని సిబ్బంది అంటున్నారు. అందులో పనిచేసే సిబ్బంది అద్దె కూడా భరించక తప్పడం లేదంటున్నారు. స్థానికంగా నివాసం ఉండలేదనే సాకుతో జీతంలో కటింగ్‌తో పాటు అద్దె భారం కూడానా అంటూ విస్తుపోతున్నారు వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది.

అద్దెలు ప్రభుత్వమే చెల్లిస్తుంది..

డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి

వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లకు ప్రభుత్వమే అద్దెలు చెల్లిస్తుందని డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి చెప్పారు. ఎవరికైనా అద్దెల చెల్లింపుల్లో ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు. ప్రజలకు వైద్యసేవల కోసం హెల్త్ క్లినిక్ సిబ్బంది అందుబాటులో ఉండాల్సిన అవసరముందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు జీతం మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు.